# పేరులేని మనిషి

"అయ్యగారూ, నేనిక బ్రతకలేను. చచ్చిపోతాను. ఆ పెద్ద చెరువులోపడి చచ్చిపోతాను."

ఉదయం యింకా ఎనిమిదన్నా కాలేదు. ఇంటిముందు వసారాలో చురుక్కుమనిపించే ఎండలోకి పడకకుర్చీ లాక్కుని ఆ రోజు పత్రిక పరికిస్తున్న పరంధామయ్యగారు "బ్రతకలేను, చచ్చిపోతాను. చెరువులో పడిపోతాను" అని వినబడగానే వులిక్కిపడి పేపరు మడిచేశారు. ఎదురుగా వగరుస్తూ నిల్చున్న రంగయ్య! ఆ పేటలోని గొల్ల పెద్ద.

"ఏం రంగయ్యా-కూర్చో, అట్లా కూర్చో" అన్నాడాయన.

"కూర్చోటానికి రాలేదయ్యగారూ. ముందు కాస్త కాఫీ యిప్పించండి" అన్నాడు రంగయ్య.

"చిట్టీ, వెళ్ళి మీ అమ్మతో రంగయ్య వచ్చాడని చెప్పు. కాఫీ పంపించమను" ఆడుకుంటున్న కూతుర్ని కేకేసి లోపలికి పంపించారు పరంధామయ్యగారు.

ఇంకా సేపటికి చిట్టి పెద్ద కంచు గ్లాసులో నిండుగా వున్న కాఫీ తొలికిపోకుండా నెమ్మదిగా అడుగులువేస్తూ వెంటవస్తుంటే, పార్వతి ఒక ఆకులో నాలుగు యిడ్లీలు పట్టుకొచ్చింది. రంగయ్యనిచూసి "ఏం రంగయ్యా! బాగున్నావా? ఇందు! ముందు ఇది తీసుకుని, కాఫీతాగు. గ్లాసు అక్కడ పెట్టు చిట్టీ" అన్నదామె. ఆత్రంగా ఆకు అందుకుని నా

ఆదరాబాదరా తినేసి, గ్లాసుడు కాఫీ రెండు గుక్కల్లో తాగేసి కాస్త నెమ్మ దించాడు రంగయ్య.

"ప్రొద్దున్నే సుబ్బయ్య హోటలుకెళ్ళి కాఫీ అడిగితే యియ్యనన్నా డండీ. ప్రొద్దున్నే కాఫీ తాగకపోతే పిచ్చెక్కినట్టుంటది" అన్నాడు రంగయ్య.

"ఎందుకని యివ్వనన్నాడు? ఏఁవన్నా బాకీ పడ్డావ?"

"మరేఁ పన్నెండు రూపాయలంట. నిన్న లెక్క చెప్పాడు. మా పెద్దోడు ఆ హోటల్లోనే కాఫీ తాగుతాడండీ. ఆణ్ణడిగి తీసుకోమన్నాను. యివ్వాళ అడిగితే 'నాకేం సమ్మంధం లేదు. ఆయన్నే అడిగి తీసుకో' మన్నాడంట. అయ్యగారూ మీరు చెప్పండి నాయం. నేను తండ్రి, ఆడు కొడుకు. సమ్మంధం లేదంటే ఎట్టా కుదురుతుంది?" అన్నాడు రంగయ్య. పార్వతి నవ్వు బిగబట్టుకుంది. "సరేవాణ్ణి పిలిపించి నే మాట్లాడతాలే, నువ్వు రేపటినుంచి హోటలు కెళ్ళక. రోజూ ప్రొద్దున్నే యిక్కడికొచ్చి కాఫీ తాగుతూండు" అన్నారు పరంధామయ్యగారు. రంగయ్య చేతికఱ్ఱ వూపుకుంటూ వెళ్ళిపోయాడు. వాడి చేతులకున్న పైడి మురుగులు ప్రొద్దుటి ఎండలో ధగధగమన్నాయి.

"త్రాగి, త్రాగి ఎట్లా అయిపోయాడో! ఎంతడబ్బూ ఆ త్రాగుడుకే చాలదు. కొడుకులున్నా, వాళ్ళకు పిల్లా జల్లా సంసారం, యీ తప్పుడు ఖర్చులన్నీ ఎట్లా భరిస్తారు వాళ్ళు మటుకు! రోజూ కాసిని కాఫీ యిస్తుం డండి. వాడొచ్చే వేళకు నువ్వు స్నానం చేస్తూనో, పూజ చేస్తూనో, వుంటావేమో, వంటమనిషితోకూడా చెప్పి వుంచు" అన్నాడు పరం ధామయ్యగారు భార్యతో. పార్వతి ఏమీ మాట్లాడలేదు.

భర్తకు దగ్గరగా ఒక కుర్చీ లాక్కొని కూర్చుంది. పరంధామయ్య గారు భార్యవంక చూస్తూ "నీకు చెప్పానా? నా చిన్నప్పుడు నన్ను ఒళ్ళో కూర్చోబెట్టుకుని మా చిన్నాన్న పాలు నా నోట్లోనే పిండేవాడు" అన్నారు.

... నిండుగా చూస్తూ "ఆఁ, చెప్పారు" అంది.

రంగయ్య పరంధామయ్య తండ్రి కాలంలో వాళ్ళ ఆవులను మేపు కొచ్చి పాలు తీసిచ్చి వెళ్ళేవాడు. ఒకరోజు పెద్దావు పాలు పిండాక, చిన్నావు దగ్గర చేరాడు రంగయ్య. పెద్దావుదూడ తల్లిని ఒకటే కుమ్ము తుంది. చిన్నావు పాలు ధారలుగా చెంబులో పిండుతున్నాడు రంగయ్య. పరంధామయ్య ఐదేళ్ళ మనసూ వింతకోరికతో నిండిపోయిందా దృశ్యం చూసి. పాలు పిండే రంగయ్య వెనగ్గా వెళ్ళి అతని భుజాలమీద వాలాడు. "ఏం కావాలి బాబూ" అన్నాడు రంగయ్య. "ఆ పాలు నా నోట్లో పిందు తావా" ఎంతో ఆశగా అడిగాడు, ఆ అబ్బాయి అటూ ఇటూ చూసి, రంగయ్యకు మహా ముచ్చటయ్యింది. చెంబు క్రిందపెట్టి 'రా బాబూ'అని దగ్గర దీసుకుని రెండు ధారలు నోట్లో పడనిచ్చాడు. పిల్లవాడికి వుక్కిరి బిక్కిరయింది. పాలధార బుగ్గలు దాటి మెడమీదగా జారి వీపు, పొట్టాకూడ తడిశాయి. ఆకథ భార్యకు; పిల్లలకు పరంధామయ్యగారు ఎన్నిసార్లు వినిపించారో లెఖ్కలేదు. ఏదో రమణీయమైన చిత్రాన్ని తిలకించి నట్లుగా ఆ కథ విన్నపుడల్లా పార్వతి పులకించిపోయేది. భర్త బాల్యరూపాన్ని మురిపెంగా వూహించుకొనేది. ఆ కథ విన్నప్పటి నుంచి ఆమె హృద యంలో రంగయ్యపై అస్పష్టమైన గౌరవభావమొకటి స్థిరంగా పాదుకుని పోయింది. రంగయ్య అటు తిరిగి యిటు తిరిగి అపరాహ్ణపు వేళకు గుడిసె చేరాడు. గుడిసెబైట మట్టి అరుగుమీద కూర్చుని పాతచీర కుట్టు కుంటోంది చిన్నమ్మ. తలుపు తోసుకు లోపలకెళ్ళి మంచంమీద కూల బడ్డాడు రంగయ్య.

"నీళ్ళు పెట్టనా?" బైటనుంచే కేకేసింది చిన్నమ్మ.

"మాపటికి చేస్తాలే ముం దన్నం పెట్టు" అన్నాడు రంగయ్య.

చీర మడిచి పెట్టేసి, పళ్ళెంలో అన్నం తెచ్చి రంగయ్య ముం దుంచింది చిన్నమ్మ. రంగయ్య భోంచేస్తున్నాడు.

"అయితే ప్రొద్దున మీ అయ్యగారింటి కెళ్ళావంటగా?"

రంగయ్య ముందు గతుక్కుమన్నా, చప్పున తేరుకుని "వెళ్లానూ; ఏం వెళ్ళితే? చిన్నా, యిహనుంచి నేను హోటలు కెళ్ళేదిలేదు. 'రో

మీ యింటికొచ్చి కాఫీ తాగుతానండి, అని చెప్పాను అయ్యగారితో. యిహ ఆయనేమంటాడూ?" అన్నాడు.

చిన్నకు నవ్వు వచ్చింది. రెండు నిముషాలాగి "వాళ్ళింటి కెళ్ళి కాఫీ తాగితే తప్పనలేదు నేను. కాని ఎళ్ళిన చోటల్లా కొడుకులమీదా, కోడళ్ళమీదా ఫిర్యాదులు చెయ్యటానికి సిగ్గెట్లా వెయ్యదు నీకు?" అంది చిన్న. రంగయ్య మాట్లాడలేదు.

"అదృష్టవంతుడివి, యిద్దరు కొడుకులున్నారు నీకు. బంగారంలా గుండొచ్చునే! ఆళ్ళ పరువు తీసి నీ పరువు తీసుకుంటున్నావ్" మాటలు పొడిగించింది చిన్న.

"తప్పేంటహ-లేకపోతే, నేతాగిన కాఫీడబ్బు లాడియ్యలేడూ? కొడుకంట కొడుకు!"

"ఏం ఎందుకివ్వాలి. వాళ్ళకు పంచియిచ్చింది చెరొక యకరం లేదు. నీ వంతు కొచ్చిన గేదె లమ్ముకున్నావు. అంతా అవచేశావు. ఫంట రాగానే అప్పులాడి లాగు ఆళ్ళని నిలవేసి డబ్బులు పుచ్చుకుంటావు. ఆరు నెలల్లో అవచేస్తావు. ఇంకా నీకాళ్ళు కాఫీ డబ్బు లెందుకివ్వాలి? ఆళ్ళూ పిల్లలు గలోళ్ళు!"

"ఆళ్ళసంగతి పోనీ, ఆళ్ళ పెళ్ళాలకైనా నేనంటే లెఖ్ఖ వుందీ?"

"ఏమయ్యింది లెఖ్ఖలేక? వాళ్ళకు ఒడిపిల్లలూ, ఎడపిల్లలూ. పొద్దస్తమానం నువ్వు పిల్చినప్పుడల్లా పలకడానికి వాళ్ళ కెట్లా తీరతంది? అందుకని లెఖ్ఖలేక పోవడమే? ఎప్పుడూ నీ పనులు చెయ్యడానికి ఒక మనిషికి సరిపోతుందయ్యె! ముసలితనం వస్తుందని తెలవదూ? భార్య పోతే మళ్ళి పెళ్ళెందుకు చేసుకోలేదు మరి?-కోడళ్ళు చెయ్యాలంట! ఆళ్ళ కదేపని పాపం!....నాకు మాత్రం నలుగురు పిల్లలుంటే, నీ కిట్లా చేయడానికి తీరేదా?" అంది చిన్న దూరంగా పాకలో కట్టేసున్న ఆవును, దూడను చూస్తూ!

"ఓస్! నీకు పిల్లలా!" అని బిగ్గరగా నవ్వాడు రంగయ్య.

కాటు తిన్నట్టయింది చిన్నకు. ఎఱ్ఱబడిన ముఖంతో "ఏం, నవ్వుగావుందే, నీకూ నవ్వులై పోయాను నేనూ!" అంది వగరుస్తూ. రంగయ్య తెల్లబోయాడు. కళ్ళనీళ్ళు పెట్టుకున్న చిన్న సరిక్రొత్త మనిషిలా కన్పించిం దతనికి. చెయ్యి కడుక్కోటానికి లేచిపొయ్యాడు.

తాళి కట్టిన భార్య కాకపోయినా, వయస్సు మళ్ళిన దగ్గిరనుంచి రంగయ్య రోజులన్నీ చిన్నమ్మ సేవలలోనే గడిచిపోతున్నాయి. యాభై దాటిన రంగయ్యకూ, ముప్ఫైదాటిన చిన్నమ్మకూ ఆరేడేళ్ళక్రితం నేస్తం కలిసింది ఎట్లాగో-ఎవరికి తెలియని సంగతి. ఈ ఆరేడేళ్ళ నుంచి ఎప్పుడైనా కొడుకులు తండ్రిని పండుగకని పబ్బానికని పిలిచినా, మహా బెట్టు చేసేవాడు రంగయ్య. బిడియమేమి లేకుండా చిన్నమ్మ పూరిపాకలోనే వుండిపోయాడు. ఆ క్రొత్తలో "గేదెలమ్మిన డబ్బుంది నా దగ్గర, ఏటా పంట డబ్బు కొంచెం వస్తుంది. నువ్వీ పాచిపని చెయ్యటం మానెయ్యరాదూ, నాకు తప్పుగా వుంటోంది" అన్నాడు రంగయ్య. "తప్పుగా వుంటోందేం? నువ్విట్లా నా గుడిసెలోనే వుండిపోవటం నాకెంత తప్పుగా వుంటుందో తెలుసా!" అంది చిన్న. అంతే మళ్ళీ రంగయ్య ఆ ప్రస్తావన తేలేదు. చిన్నమ్మను గురించి రకరకాలుగా చెప్పుకుంటా రా ప్రక్కల. ఎక్కువగా వినవచ్చే కథ—చిన్నమ్మకు పిల్లలులేరని దాని మొగమనిషి మారుమనువు చేసుకుంటే వుక్రోషం పట్టలేక అది వాణ్ణి వదిలేసి యీ వూరొచ్చిందని!

• • •

ఆ రోజు వుదయం కాఫీల పనయ్యాక పెనక వసారాలో చాప పరుచుకు కూర్చుని కూతురి తల దువ్వుతోంది పార్వతి. "అమ్మగారూ" అన్న పిలుపు విని తల యెత్తి చూచిందామె.

"ఏం చిన్నమ్మా?" అంది పార్వతి. "మీ గొల్ల కాఫీ అడిగి పట్టమ్మన్నాడండీ" అంది చిన్న.

"ఏం రంగయ్యకు ఒంట్లో బాగాలేదా?"

"ఒక రేత్రికాడ జర మొచ్చిందండీ. వళ్ళంతా నొప్పులంట. ఇంకా లేవలేదు."

పార్వతి వంట మనిషిని పిలిచింది. ఆవిడ చిన్నమ్మ తెచ్చిన చిన్న కంచుచెంబు నిండా కాఫీపోసి వెళ్ళింది. కాఫీ తీసుకు వెళ్తూ వెళ్తూ మళ్ళీ వెనక్కి చూచి నెమ్మదిగా "అమ్మగారూ" అంది చిన్న. పార్వతి ఆశ్చర్యంగా "ఏంటి చిన్నమ్మా" అంది.

"మీరు కట్టుకున్న చీర పాతదైపోయినాక గుర్తుంచుకు నాకివ్వండమ్మాగారూ" అంది చిన్న ఆశగా, తమిగా ఆ చీరవంక చూస్తూ. పార్వతి తెల్లబోయి తను కట్టుకున్న చీరవంక చూసుకుంది. సరిగంచు పచ్చచీర! తలెత్తి చిరునవ్వుతో "సరేలే చిన్నమ్మా, జ్ఞాపకముంచుకుంటాలే" అంది. చిన్నమ్మ వెళ్ళిపోయింది. యింతలోనే వసారాలోకి వస్తూ పరంధామయ్యగారు "ఏమిటీ, అదేమిటో అంటోంది?" అన్నారు. "ఈ చీర కావాలట దానికి. ఎందుకో అది పచ్చ చీర తప్ప యింకోరంగు కట్టదు" అంది పార్వతి. పరంధామయ్యగారు ఏదో గుర్తుకొచ్చినట్లుగా "యిదే కాదు, నాకు బాగాగుర్తు. వాడి చచ్చిపోయిన భార్యకూడా ఎప్పుడూ ఆకుపచ్చ చీరలే కట్టేది" అన్నారు.

ఆ తర్వాత వారంరోజులకు ఒకనాటి సాయంత్రం రంగయ్య పెద్ద కొడుకు వచ్చి "మీరన్నా చెప్పండయ్యగారూ మూడురోజులుగా మరీ నీరసించి పొయ్యాడు ముసలోడు, ఏం చెప్పగలం? ఇంటికి రమ్మంటే రానంటాడు. దాని గుడిసెలోనే ఏదన్నా అయితే ఎంత తప్పుగా వుంటది మాకు?" అన్నాడు. పరంధామయ్యగారు తలపంకించి "నే చెప్తాలే, నువ్వెళ్ళు" అన్నారు. అంతా ఆలకించిన పార్వతి, రంగయ్య కొడుకు వెళ్ళిపోగానే "ఏంవిటి మీరు చెప్పేది?" అంది. ఆయన భార్య ముఖంకేసి చూసి కాస్త తడబడుతూ "అదే యింటికెళ్ళమని...."

"ఏం యిన్నాళ్ళూ కొడుకులూ, కోడళ్ళు చూశారా? మీరేమీ చెప్పనక్కరలేదు" పార్వతి గొంతు కొద్దిగా వణికింది. పరంధామయ్య గారు ఏదో అర్థమైనట్లుగా భార్యకేసిచూసి చిన్నగా, జాలిగా నవ్వారు.

ఆ మర్నాడు తెల్లవారేప్పటికే చిన్నమ్మ గుడిసె దగ్గర జనం గుమిగూడారు. రంగయ్య కోడళ్ళు గొల్లున ఏడుస్తున్నారు. కులపు పెద్దలు కొడుకులను ఓదారుస్తున్నారు. చిన్నమ్మ ఒంటరిగా ఒకమూల కూర్చునుంది. అంత్యక్రియలన్నారు, అవన్నారు - అందరూ వెళ్ళిపోయారు. చిన్నమ్మ కదల్లేదు, మెదల్లేదు మూడురోజులపాటు. ఆ తర్వాతనుంచి తెల్లారగట్లేలేచి పనిలోనికి వెళ్ళిపోయేది. గుబులుపుట్టినరోజు కుండెడు వేన్నీళ్ళు కాచి చింతచెట్టు క్రింద దిమ్మరించేది!

♦ ♦ ♦

"అమ్మగారూ కాస్త వూరగాయ పెట్టించండి" ఆకుకూర ఏరుతున్న పార్వతి తలెత్తి చూచింది. సూరమ్మ! 'అమ్మగారూ' 'అయ్యగారూ' అంటూ ఆ విధంగా ఆ యింటికి అనుదినం వచ్చీ పొయ్యేవాళ్ళకు లెఖ్ఖ వుండదు. పార్వతి వంటమనిషిని పిలిచి "సూరమ్మకు కొంచెం పచ్చడేమన్నా పెట్టి పంపు" అంది. సూరమ్మ ఆకు అందుకుని వెళ్ళకుండా ఊసుల్లోకి దిగింది.

"అదికా దమ్మగారూ! అది చూశారూ, ఎంతయిద్దైనా ఏడేళ్ళనుంచి దాని గుడిసెలోనే పడుండె, బొట్టయినా తీసేసిందీ? అమ్మో! ఎంతటి దనుకున్నారు?- ఆ ముందునాటి రాత్రి నేను గుడిసెలో వున్నాగా- చచ్చి ఏ సొర్గాన వున్నాడో, చేతి మురుగులు రెండు తీసి దాని చేతిలో పెట్టి "యివి నువ్వే వుంచుకో" అని ఘోరుమన్నాడు. ఇంకోరైతే ఎంత ప్రాణంగా అట్టిపెట్టుకుందురు? అమ్మో చిన్నమ్మ! ఆ మురుగులు తీసికెళ్ళి పెద్దకోడలు కప్పగించి వచ్చిందట! మీకు తెలియదుగాని అమ్మగారూ! చిన్నమ్మకు చెడ్డ గీర్వాణం-నే వెళ్తానమ్మగారూ!" సూరమ్మ వెళ్ళిపోయింది. పార్వతికి ఊపిరి సల్పింది. ఆమె తనకు తాను చెప్పుకుంటున్నట్టుగా అన్నది "చిన్న! అది బొట్లు, నల్లపూసలూ తీసెయ్యకపోతేనేం? అప్పటినుంచీ మళ్ళీ యెప్పుడైనా పచ్చచీర కట్టిందీ?"

—o—